


పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.7200 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4200 క్యూసెక్కులు వదులుతున్నారు.



కృష్ణా డెల్టాకు 2216 క్యూసెక్కులు

తాడేపల్లి రూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2216 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. కొమ్మమూరు కాలువకు 1231 క్యూసెక్కులు వదిలారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

రేపు ఇంద్రకీలాద్రిపై శ్రీపంచమి వేడుకలు

- సరస్వతిదేవిగా దుర్గమ్మ దర్శనం
- విద్యార్థులకు పెన్నుల పంపిణీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఈ నెల 26వ తేదీ మాఘ శుద్ధపంచమి(శ్రీపంచమి)ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీ పంచమి నేపథ్యంలో అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ మూర్తిని సరస్వతిదేవి అలంకారంలో దర్శించుకునే భాగ్యం భక్తులకు, విద్యార్థులకు కలగనుంది. వార్షిక పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని, పోటీ పరీక్షలలో నెగ్గి కోరుకున్న సీటు లభించాలని కాంక్షిస్తూ అమ్మవారి పాదాల వద్ద ఉంచి పూజలు నిర్వహించిన పెన్నులను శ్రీపంచమి రోజున పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవస్థానం పూర్తి చేసింది. కనకదుర్గనగర్ నుంచి కొండపైకి చేరుకునేలా దేవస్థానం క్యూలైన్లు ఏర్పాటు చేసింది. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ఉత్సవ మూర్తిని దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవ మూర్తిని దర్శించుకున్న విద్యార్థులందరికీ పెన్ను, అమ్మవారి పాకెట్ సైజ్ ఫొటో, కుంకుమ, ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యార్థులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా స్కూల్, కాలేజీ యూనిఫాంను, ఐడీ కార్డును తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని ఆలయ అధికారులు సూచిస్తున్నారు. 26వ తేదీ రిపబ్లిక్ డే నేపథ్యంలో స్కూళ్లు, కాలేజీలకు సెలవు కావడంతో పెద్దఎత్తున విద్యార్థులు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు 40 వేల పైబడి విద్యార్థులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని, ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించండి

నరసరావుపేట: ప్రభుత్వ పెన్షన్‌దారులందరూ ఫిబ్రవరి 28వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని జిల్లా ఖజానా, లేఖల అధికారి వి.స్వామినాథన్ మంగళవారం కోరారు. లైఫ్ సర్టిఫికెట్‌ను జీవన ప్రమాణ యాప్, ఖజానా కార్యాలయం, పెన్షన్ అసోసియేషన్‌లో, మీసేవ లేదా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా సమర్పించవచ్చన్నారు. వేలిముద్రల సమస్య ఉన్నవారు నేరుగా ఖజానా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రెండు పెన్షన్‌లు పొందేవారు, కుటుంబ పెన్షన్, జీఓ 315 ప్రకారం పెన్షన పొందేవారు తగిన సర్టిఫికెట్లతో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. పెన్షన్‌దారులందరూ తమ ఆధార్ ఆధారిత మొబైల్ నంబరు హెర్బ్ పోర్టల్‌లో నమోదు చేయుట ద్వారా ఈకేవైసీని పూర్తి చేయాలని కోరారు. ఈకేవైసీ విషయంలో సంబంధిత ఎస్‌టీఓ కార్యాలయం తగిన సహకారం అందజేస్తుందని చెప్పారు.

కొప్పురావూరు, కంతేరు రైల్వే గేట్ల మూత

తాడికొండ: సబ్‌వేల నిర్మాణం నిమిత్తం తాడికొండ మండలం కంతేరు– పెదకాకాని మండలం కొప్పురావూరు రైల్వే గేట్లను 6 నెలల పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తహసీల్దార్ ఫణీంద్ర బాబు తెలిపారు. ప్రయాణికులు అసౌకర్యాన్ని గమనించి గేటు నంబర్ 7 ద్వారా రాకపోకలు సాగించాలని సూచించారు.

లక్షకు చేరిన మిర్చి బస్తాల రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,05,607 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 88,222 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 61,269 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 570.60 అడుగుల వద్ద ఉంది. ఇది 258.0802 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 10,200, ఎడమ కాలువకు 8,367, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 4,494, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 24,861 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఇదిగో చదువుల యజ్ఞం

చదువుల ఒడి రమ్మంటోంది. పిల్లలు సర్రున జారుతూ కేరింతలు కొడతారని తెలిసి జారుడు బల్లలు. రివ్వుమంటూ తిరుగుతూ నవ్వులు పూయించేలా రంగులరాట్నం.. ఆశల ఉయ్యాల.. ఇట్టే ఆకర్షించేలా గోడలపై రంగురంగుల బొమ్మలు .. బుడిబుడి చిన్నారులకు క్రీడా పరికరాలు.. పుస్తకాల కుస్తీలో అలసిపోకుండా గదులు.. సంబరపడిపోయేలా వసతులు. ప్రస్తుతం పల్లె నుంచి పట్టణం వరకు ఆకర్షిస్తున్నాయి. అవే మన ప్రభుత్వ పాఠశాలలు. జగనన్న కృషితో చదువుల బడి రూపరేఖలు మారిపోయాయి. మళ్లీ భారీగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టారు.



పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరులో నాడు- నేడు పనులు పూర్తయిన పాఠశాల

బడుల అభివృద్ధికి మలి దశ నిధులు

- పల్నాడు జిల్లాలో జోరుగా పాఠశాలల ఆధునికీకరణ
- రెండో విడతలో రూ.303 కోట్లు మంజూరు
- తొలివిడత రూ.147.4 కోట్లతో అభివృద్ధి
- నిధుల ఖర్చు విషయంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

సాక్షి, నరసరావుపేట: 'మన బడి నాడు–నేడు'తో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ఎక్కడ చూసి చుడముచ్చటగా పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య ఘననీయంగా పెరిగింది. మొదటి దశ విజయవంతం కావడంతో రెట్టింపు ఉత్సాహంతో మలి విడత పనులు ముమ్మరంగా చేపడతున్నారు. రెండో విడత అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తున్నారు. ఇందులో



పిడుగురాళ్ల మండలం జూలకల్లులో నాడు- నేడు పనులు

608 ప్రాథమిక, 103 ప్రాథమికోన్నత, 174 ఉన్నత పాఠశాలలు, 13 అంగన్‌వాడీ కేంద్రాలు, 9 జూనియర్ కళాశాలలను ఆధునికీకరిస్తున్నారు.

రాష్ట్రంలోనే ప్రథమ స్థానం...

మన బడి నాడు– నేడు కింద ప్రభుత్వ పాఠశాలలో 10 రకాల మౌలిక వసతులను కల్పించనున్నారు. స్కూళ్లలో ఫర్నిచర్, నీటివసతి, రక్షిత తాగునీరు,

రెండో విడతలో..

ఎంపికైన ప్రభుత్వ విద్యాసంస్థలు	907
ఖర్చు చేయనున్న నిధులు (ఫిబ్రవరి నెల చివరకు పూర్తి లక్ష్యం)	రూ.303 కోట్లు

పెయింటింగ్స్, గ్రీన్ చాక్ బోర్డ్, ఇంగ్లిష్ ల్యాబ్, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, మరమ్మతులు, ప్రహరీ, వంట గది వంటి వసతులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. జిల్లాలో 898 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 5,097 పనులు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటికే 2,643 పనులు పురోగతిలో ఉన్నాయి. జిల్లాకు కేటాయించిన రూ.303 కోట్లలో జనవరి మూడో వారానికి రూ.71 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోనే నిధుల ఖర్చులో ప్రథమస్థానంలో పల్నాడు జిల్లా నిలిచింది. పనులు వేగవంతంగా, నాణ్యత జరగటంకోసం విద్యాశాఖ, సచివాలయ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ విభాగం వంటి శాఖలు సంయుక్తంగా పనిచేస్తున్నాయి. ఈ నాడు–నేడు పనులు తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు.

ఫిబ్రవరి నాటికి అన్ని పనులు పూర్తి...



ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చి కార్పొరేట్ తరహాలో మార్చాలన్న ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా మన బడి నాడు- నేడు పనులు చేస్తున్నాం. జిల్లాలో 907 పాఠశాలలు, అంగన్‌వాడీలలో రూ.303 కోట్లతో నాడు–నేడు రెండో దశ పనులు జరుగుతునున్నాయి. అభివద్ధి పనుల్లో తల్లిదండ్రుల కమిటీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. నాడు–నేడు పనులను పర్యవేక్షించేందుకు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటుచేశాం. దాని ద్వారా పనుల పురోగతి, నాణ్యత వంటి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్

బాలికల ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలి

కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట ఈస్ట్: బాలికలు చదువుతో పాటు శారీరక, మానసిక దృఢత్వం కలిగిఉండాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. రక్తహీనత నుంచి బయటపడేందుకు అవసరమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తమ ఆరోగ్యంపై అవగాహన కలిగిఉంటారని, తద్వారా అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల విద్యార్థినులకు జగనన్న గోరుముద్ద పేరుతో బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నట్టు వివరించారు. పాఠశాలలో అందించే కోడిగుడ్డు, చిక్కీలను స్వీకరించాలని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ జి.శోభారాణి మాట్లాడుతూ, బాలబాలికల లింగ నిష్పత్తిపై ఆందోళన వ్యక్తం చేశారు. 0–6 సంవత్సరాల బాలికల లింగనిష్పత్తి ఎంతో నిస్పృహకు గురిచేస్తోందని తెలిపారు. లింగ నిర్ధారిత పరీక్షల నిరోధక చట్టం బాలికల నిష్పత్తి పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. లింగ నిర్ధారిత పరీక్షలు నిర్వహించేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అరుణ, డెప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ చంద్రశేఖర్, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ హనుమకుమార్, డాక్టర్ పద్మజ, ప్రధానోపాధ్యాయిని ఎం.సులేఖ పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనం కాపాడే ప్రభుత్వం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ, హాజరైన పీఆర్కే, ఎమ్మెల్సీ దొక్కా



యార్డు పాలకవర్గాన్ని అభినందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

- ప్రభుత్వ చీఫ్ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే)
- అట్టహాసంగా యార్డు పాలక వర్గం ప్రమాణ స్వీకారం
- నూతన కమిటీకి మంత్రి రజిని అభినందనలు

మాచర్ల: రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను కాపాడుతూ మార్కెట్ యార్డులను అభివృద్ధి చేస్తూ తీవ్ర కృషి చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంతో ప్రమాణస్వీకారం సోమవారం రాత్రి యార్డు కార్యదర్శి ఇస్మాయిల్ చేయించారు. కమిటీ అధ్యక్షుడిగా తాడి వెంకటేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ కొత్తమాసు పాండురంగారావులతో పాటు మరో 18 మంది మార్కెట్ యార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వంగా పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిపై ఎల్లో మీడియా దాడి చేయటం సిగ్గుచేటుగా చెప్పారు. టీడీపీ కుట్రలను తిప్పికొట్టి సీఎంగా జగన్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వ్యక్తులకు ప్రాధాన్యమిచ్చి పెద్దన్నకు మొదటి స్థానం ఇవ్వటం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతునాయక్, పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్ మాట్లాడారు. తొలుత మాచర్ల పట్టణంలో నాయకులు, కార్యకర్తలు, భారీగా ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అభినందించారు. మార్కెట్ యార్డు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యమిచ్చి అవకాశం కల్పిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందని పేర్కొన్నారు. నూతన పాలక వర్గం రైతుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ పరీక్ష

- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది కేంద్రాలు
- ఉదయం 7.00 గంటలకే చేరుకున్న విద్యార్థులు



విద్యార్థిని హాల్ టికెట్ తనిఖీ చేస్తున్న కళాశాల సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశానికై ఉద్దేశించిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన పేపర్–1, పేపర్–2 ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు సకాలంలో హాజరయ్యారు. బీఈ, బీటెక్, బీఆర్క్, ప్లానింగ్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 9,500 మంది విద్యార్థులు ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరగనున్న ఆన్‌లైన్ పరీక్షలకు ఆయా తేదీల్లో కేటాయించిన స్లాట్ల ఆధారంగా హాజరుకానున్నారు. పరీక్ష సమయానికి రెండు గంటలు ముందుగా పరీక్ష కేంద్రాలు చేరుకోవాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విధించిన నిబంధనలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ కళాశాలలు గుంటూరు నగరంతో పాటు ఆయా ప్రాంతాలకు దూరంగా ఉండటం, విద్యార్థులను ఉదయం 7.00 గంటలకే పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లాల్సి ఉన్న దృష్ట్యా చలి తీవ్రతలోనే తల్లిదండ్రులు కేంద్రాలకు వెళ్లారు.

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- రిహార్సల్స్ పరిశీలన



పోలీసు బలగాల కవాతును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: గణతంత్ర వేడుకల(ఈనెల 26న) సందర్భంగా కవాతు చూడచక్కగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సూచించారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ క్రీడామైదానంలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గౌరవ వందనాన్ని స్వీకరించి, పోలీస్ కవాతు రిహార్సల్స్‌ను వాహనంలో నుంచి మంగళవారం పరిశీలించారు. జిల్లా ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ పర్యవేక్షణలో ఆర్ఐ వెంకటరమణ పరేడ్ కమాండర్‌గా రిహార్సల్స్ నిర్వహించారు. పోలీస్ బలగాలు, ఎన్‌సీసీ, స్కౌట్స్ విభాగాలు పరేడ్ మార్చింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు అడ్మిన్ ఎస్పీ జి.బిందుమాధవ్, డీఎస్పీ విజయభాస్కర్‌రావు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు

నిబంధనలు పాటించాలి: జేసీ రాజకుమారి



మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

గుంటూరు మెడికల్: ప్రతినెలా అబార్షన్లు మానిటరింగ్, డెకాయ్ ఆపరేషన్స్ తప్పనిసరిగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అధ్యక్షతన పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ కమిటీ, జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్స్‌ను ఆకస్మిక తనిఖీలు చేయాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న, ఎక్కువగా ఉన్న మండలాలను గుర్తించి ఆరోగ్య కార్యకర్తల ద్వారా సర్వే చేయించి కారణాలను విశ్లేషించి రిపోర్ట్ అందజేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అబార్షన్లు ఎక్కువగా జరుగుతున్న ప్రైవేట్ ఆసుపత్రులను గుర్తించి వాటిపై సమగ్ర విశ్లేషణతో రిపోర్ట్ అందచేయాలని కోరారు. సంతాన సాఫల్య కేంద్రాలను తనిఖీ చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కేంద్రాలపై తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె.హనుమంతరావు మాట్లాడుతూ జిల్లాలో రిజిస్ట్రేషన్ లేకుండా స్కానింగ్ సెంటర్ నడపరాదన్నారు. రిజిస్ట్రేషన్ లేని వారిపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. లింగ నిర్ధారణ కార్యక్రమాలకు పాల్పడుతున్న స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో కొత్తగా రెండు స్కానింగ్ సెంటర్లకు, మూడు సెంటర్లకు రెన్యువల్‌కు అనుమతి మంజూరు చేశారు. కొత్తగా రిజిస్ట్రేషన్ కొరకు నమోదు చేసుకున్న 12 ఏఆర్‌టీ కేంద్రాలకు, రెండు సరోగసి కేంద్రాలకు అనుమతి మంజూరు చేశారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, ఐసీడీఎస్ పీడీ మనోరంజని పాల్గొన్నారు.

దండిగా స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి

- రిపబ్లిక్ డే సందర్భంగా ప్రారంభానికి సిద్ధమైన దండి మార్చ్ విగ్రహాలు
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటి



పెదకాకాని వై జంక్షన్‌లో దండి మార్చ్ విగ్రహాలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెదకాకాని: భారత స్వాతంత్రోద్యమంలో ఉప్పు సత్యాగ్రహాన్ని కీలకఘట్టంగా అభివర్ణించవచ్చు. బ్రిటిష్ పాలకులు ఉప్పుపై పన్ను వేయడాన్ని నిరశిస్తు గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమం నుంచి దండి వరకు 384 కిలోమీటర్లు జరిగిన పాదయాత్రను జాతిపిత మహాత్మాగాంధీ ముందుండి నడిపారు. ఉప్పు సత్యాగ్రహం నాటి దేశ ప్రజల్లో రగిలించిన స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి అంతాఇంతా కాదు.

ఆ దండి పాదయాత్ర స్ఫూర్తిని నేటితరానికి తెలియజేసేలా గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు నగర శివారు పెదకాకాని వై.జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన దండి మార్చ్ విగ్రహాలను రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం ప్రారంభించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు తదితరులు పరిశీలించారు. అనంతరం మేయర్ కావటి మనోహర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించేందుకు, స్వాతంత్ర్య ప్రాముఖ్యతను తెలిపేలా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దండి మార్చ్, స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పెదకాకాని వై జంక్షన్ వద్ద 18 అడుగుల ఎత్తు, 90 అడుగుల పొడవు ఉన్న మహాత్మా గాంధీ విగ్రహంతో పాటు దండి మార్చ్‌లో పాల్గొన్న మరో ఎనిమిది మంది ఉద్యమకారులతో కూడిన విగ్రహాలతో కూడిన మార్చ్ స్మారక స్థూపం నిర్మించినట్లు పేర్కొన్నారు. జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కామిరెడ్డి రంగారెడ్డి, పఠాన్ రిహానా, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా పాల్గొన్నారు.

బలహీనవర్గాలు అభివృద్ధి సాధించాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి


కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి: సమాజంలోని ఒడిదుడుకులను అధిగమించి బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి వైపు పయనించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బడుగు బలహీనవర్గాల ఐక్యవేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో ఐక్యవేదిక జిల్లా స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. తొలుత బంగ్లా సెంటర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే, గుర్రం జాషువా విగ్రహాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్సీ జంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ జంగా మాట్లాడుతూ సమాజంలో ఎదిగిన కులాలను విమర్శించడం మానుకొని ఆ కులాలు ఏ విధంగా అభివృద్ధి చెందాయో, అదేవిధంగా బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి చెందేలా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో మార్పుతో పాటుగా అట్టడుగు వర్గాల ప్రజలను ఏకం చేసేందుకు ఐక్య వేదిక ఉద్భవించిందని, బలహీనవర్గాల నుంచి నాయకత్వం రావాలన్నారు. నాయకుడిగా ఎదగాలంటే ప్రజల సమస్యలు పరిష్కరించే బుద్ధి కలిగి ఉండాలని, కష్టాల్లో ప్రజలకు అండగా ఉండే వ్యక్తే నాయకుడిగా ఎదిగే అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్సీ జంగా చెప్పారు. కుల నిర్మూలన జరిగి బలహీనవర్గాలు సంఘటితం కావాలని, సమసమాజాన్ని స్థాపించి బలహీనవర్గాల అభ్యున్నతికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, అన్ని రంగాల్లో బలహీనవర్గాలు అభివృద్ధి సాధించాలని కోరారు. ఐక్యవేదిక ద్వారా పల్నాడు ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ, యువకుల ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో యువత చైతన్యవంతులై మార్పు కోసం పాటుపడాలని ఆయన సూచించారు. నడికుడి పారిశ్రామికవాడలో కెమికల్ పరిశ్రమల వల్ల జరుగుతున్న నష్టాలపై ఐక్యవేదిక దృష్టి సారించాలని, ప్రజలకు అండగా ఉండాలని ఎమ్మెల్సీ జంగా తెలిపారు. వైఎస్సార్ హయాంలో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ మోహన్‌రెడ్డి నాయకత్వంలో బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకునేందుకు అవకాశాలు కల్పించారని, ఐక్యవేదికలో అత్యధికులు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైనని ఆయన తెలిపారు. నూతనంగా నియమితులైన ఐక్యవేదిక కమిటీ సభ్యులకు ఎమ్మెల్సీ జంగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల మోతు రాజు, ఉపాధ్యక్షుడు గాదె రామకృష్ణారావు, కార్యదర్శి షేక్ షరీఫ్, సహాయ కార్యదర్శి నకరికంటి లాల్‌బాషా, కోశాధికారి సాతులూరి రామాంజనేయులు, మాజీ ఎంపీపీలు అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, కార్మిక విభాగం పార్లమెంట్ అధ్యక్షుడు గద్దల వేదమణి, ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు ముశ్యం వెంకటేశ్వర్లు, నాయకులు బత్తుల వెంకయ్య, పీపీ నరసింహారావు, నాగెండ్ల జయరావు, భూక్యా కల్యాణ్‌నాయక్, బలుగూరి సీతారామయ్య, సైదు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్
- తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష
- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


కోటప్పకొండ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, వేదికపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట రూరల్: రాష్ట్ర పండుగ హోదాలో నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 18వ తేదీ నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై కోటప్పకొండ ఘాట్ రోడ్డులోని పర్యాటక కేంద్రంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అడిషనల్ ఎస్పీ బిందుమాధవ్, డీఎఫ్‌వో రామచంద్రరావు పాల్గొన్నారు. లక్షలాదిగా తరలివచ్చే యాత్రికుల కోసం గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. రెండు కమాండ్ కంట్రోల్ రూమ్‌ల ద్వారా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నరసరావుపేట నుంచి కోటప్పకొండకు 185 బస్సులు, కొండ కింద నుంచి పైకి 80 బస్సులు, చిలకలూరిపేట నుంచి 120, వినుకొండ నుంచి 35, అద్దంకి నుంచి 25, చీరాల నుంచి 45, ఒంగోలు నుంచి 45 బస్సులను నడపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కొండ దిగువన రెండు తాత్కాలిక బస్సు స్టేషన్‌లను ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. వీఐపీల కోసం 20 బస్సులను సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. నాలుగు క్యూలైన్‌ల ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తామని ఆలయ ఈవో వేమూరి గోపి తెలిపారు. భక్తుల కోసం స్వామి వారి ప్రసాదాలు 1.70 లక్షల లడ్డూ, 80 వేల అరిసెలను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, బిస్కెట్ ప్యాకెట్లను అందిస్తామన్నారు. కొండదిగువన యాత్రికులకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. తిరునాళ్ల రోజు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఐదు జనరేటర్స్, 19 ట్రాన్స్‌ఫార్మర్స్‌తో పాటు 200 మంది సిబ్బందిని విధుల్లో నియమిస్తున్నట్టు తెలిపారు. జాతర జరిగే ప్రాంతంలో తొమ్మిది మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తామని డీఎంఅండ్‌హెచ్‌ఓ తెలిపారు. సమావేశంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామకృష్ణ కొండలరావు, జెడ్పీటీసీ పి.చిట్టిబాబు, సర్పంచ్ వెన్నపూస నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

దాదాపు 20 లక్షల మంది తిరునాళ్ల రోజు కోటప్పకొండకు వస్తారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తిరునాళ్లను విజయవంతం చేయాలి. సామాన్య భక్తుల నుంచి వీఐపీల వరకు అందరికీ మంచి దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేయాలి. ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ ఏడాది వన్‌వేను అమలుచేస్తున్నాం. తిరునాళ్ల రోజు వీఐపీలు వారికి కేటాయించిన బస్సుల్లోనే కొండపైకి రావాలి. ప్రైవేట్ వాహనాలను అనుమతించం.

– డాక్టర్ గోపిరెడ్డి, ఎమ్మెల్యే

ట్రాఫిక్ నిర్వహణను చాలెంజ్‌గా తీసుకుంటాం

లక్షలాదిగా భక్తులు తరలివచ్చే కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. భక్తులతో పాటు ప్రభలకు ఎలాంటి అవరోధాలు లేకుండా కొండకు చేరుకుని, తిరిగి వారి గమ్యస్థానాలకు చేరే విధంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆరు రహదారుల నుంచి కొండకు యాత్రికులు చేరుకోవచ్చు. దీంతో పాటు లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. భక్తుల భద్రతే లక్ష్యంగా పనిచేస్తాం.

– రవిశంకర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి



బల్లికురవ: పిచ్చి కుక్కల స్వైరవిహారంతో గొర్రెలు చనిపోవటంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఈఘటన మండలంలోని సోమవరప్పాడులో జరిగింది. గ్రామానికి చెందిన గొర్రెల యజమానులు గోరంట్ల సాంబయ్య, వెంకటేశ్వర్లుకు చెందిన 12 గొర్రెలపై సోమవారం రాత్రి కుక్కలు దాడిచేయడంతో మృత్యువాత పడ్డాయి. నెల రోజులుగా గ్రామంలో పిచ్చికుక్కల స్వైరవిహారంతో కొత్త వ్యక్తులు గ్రామంలోకి రావాలన్నా, గ్రామస్తులు బయటకు వెళ్లాలన్నా భయపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు కొండవర్తి సాంబయ్య తెలిపారు. ఒక్కో గొర్రె విలువ రూ.20 వేల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని బాధితులు కోరారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

నరసరావుపేట: పదే పదే ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లలో మళ్లీ ప్రమాదాలు జరగకుండా తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా రోడ్డు సేఫ్టీ కమిటీ చైర్మన్, కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. జిల్లాలో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో 'డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ' సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవేస్, ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. లైటింగ్ లేకపోవడం వల్ల చాలా జంక్షన్‌లలో ప్రమాదాలు జరుగుతున్నాయని సమావేశంలో జిల్లా రవాణా అధికారి టీకే పరంధామరెడ్డి తెలుపగా, తక్షణమే ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజానాయక్, జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జి.శోభారాణి, ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి, రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో కన్వీనర్ బి.దుర్గాపద్మజ పాల్గొన్నారు.

ప్రభుత్వ పనులు లక్ష్యం మేరకు పూర్తిచేయండి

నరసరావుపేట: జిల్లాలో ప్రభుత్వ లక్ష్యం మేరకు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ప్రభుత్వ ప్రాధాన్యత క్రమంలో జరుగుతున్న పనులు, విధులుపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, ఏపీవోలు, ఏపీడీలు, డీఈ, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్ కుమార్, సీపీవో ముక్తేశ్వరరావు, డీపీవో విజయభాస్కర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్బారాయుడు, డీఎల్‌డీవో సుధాకర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బేల్దారి మేస్త్రి మృతి

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆమంచి


గోపి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుంటున్న ఆమంచి

మార్టూరు: ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో బేల్దారి మేస్త్రి మృతి చెందాడు. ఈ ఘటన మార్టూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. యద్దనపూడి మండలం యనమదల గ్రామానికి చెందిన గుంజి గోపి (28) బేల్దారి మేస్త్రిగా జీవనం సాగిస్తుంటాడు. మార్టూరులోని జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఇంటిపైకి ఇనుప చువ్వలు తీసుకువెళ్తుండగా ప్రమాదవశాత్తూ చువ్వలు విద్యుత్ లైన్‌కు తగలటంతో విద్యుదాఘాతానికి గురై ఇంటిపై నుంచి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆటోలో మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గోపి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు గోపికి భార్య, ఐదేళ్ల చిన్నారి మణికంఠ, మూడేళ్ల కుమార్తె అమూల్య ఉన్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే మార్టూరులో పర్యటిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ ఆసుపత్రికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


పాడిపరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట


మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు

యద్దనపూడి: పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బాపట్ల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పోలూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగా ఆర్బీకే కేంద్రాల పరిధిలో సిబ్బందిని ఏర్పాటుచేసి పశువులకు సేవ అందిస్తోందని చెప్పారు. ఆసుపత్రికి రాలేని స్థితిలో ఉండే పశువులకు సైతం మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో సంచార పశువైద్యశాలలను అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. పశువులు అకస్మాత్తుగా ఇబ్బందులకు గురైనప్పుడు 1962 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఉచిత పశు అంబులెన్స్ సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. అనంతరం పశువులు, మేకలకు వచ్చే సీజనల్ వ్యాధులు, నివారణ, సమీకృత దాణ, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి బి.సురేష్, పోలూరు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ భవానీ, పశువైద్య సిబ్బంది వీరాస్వామి, ఉదయ్, స్థానిక పశుపోషకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపు హర్షణీయం

బాపట్ల ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిగం సురేష్ కుమార్



ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పది సంవత్సరాలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షణీయమని బాపట్ల ఎంపీ, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిగం సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013 జనవరి 23న మొదలైన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ఈ నెల 23తో ముగిసిందని, కానీ రద్దు కాకుండా ముందుగానే గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్స్ తీసుకురావడం ఎస్సీ, ఎస్టీలు వరంగా భావించాలన్నారు. జగనన్న ఎస్సీ, ఎస్టీలపై తనకున్న ప్రేమను చాటుకున్నారన్నారు. సబ్‌ప్లాన్ నిధుల ద్వారా ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు సాయం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పట్టణ పేదలను ఆదుకోవడం, ఎస్సీల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్‌లు జారీ చేయడం వంటి పనులను కేంద్రం మెచ్చుకుందన్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక కింద దేశంలో మొత్తం 29.84 లక్షల ఎస్సీ కుటుంబాలకు సాయం అందించగా, అందులో 29.10 లక్షల ఎస్సీ కుటుంబాలు మన ఏపీలో సాయం పొందడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో 6.15 లక్షల ఎస్సీ విద్యార్థులకు సబ్‌ప్లాన్‌లో స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ప్రభుత్వం, సబ్‌ప్లాన్ కింద 1,38,245 ఇళ్ల నిర్మాణం చేయడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు.

ఉరకలెత్తిన ఒంగోలు గిత్తలు


షీల్డు అందజేస్తున్న ఎస్పీ రవిశంకర్ రెడ్డి, అదనపు ఎస్పీ బిందుమాధవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


ఎడ్ల జతతో జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే

- నరసరావుపేటలో మూడో రోజు పోటీలకు హాజరైన ఎమ్మెల్యే, ఎస్పీ
- రెండో రోజు విజేతలకు బహుమతులు అందజేత
- పోటీలు తిలకించేందుకు వేలాదిగా ఔత్సాహికులు రాక

నరసరావుపేట: డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి వృషభరాజాల బండలాగుడు బలప్రదర్శన పోటీలు మూడోరోజు రైతుల కేరింతల మధ్య ఉత్సాహ భరితంగా సాగాయి.. రైతు సంబరాల్లో భాగంగా గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్‌పై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలకు మంగళవారం సాయంత్రం జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీ జి.బిందుమాధవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నాలుగు పళ్ల విభాగానికి హాజరైన ఎద్దుల యజమానులకు ఎమ్మెల్యే గోపిరెడ్డితో కలిసి అతిథులు షీల్డు, కిట్లను అందజేశారు. పోటీలో పాల్గొంటున్న 18 ఎడ్ల జతల యజమానులను అభినందించి పోటీలను తిలకించారు. దీంతో పాటు సోమవారం రెండోరోజు నిర్వహించిన రెండుపళ్ల విభాగంలో విజేతలైన వారికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

ఈ పోటీల్లో మొదటి విజేతగా మార్టూరు, పిన్నెల్లికు చెందిన గౌతుకట్ల వెంకటశివయ్య యాదవ్, పి.రిహాన ఎడ్ల జతకు మొదటి బహుమతి, నంద్యాలకు చెందిన ఓగురు చిన సుబ్బారాయుడు, సైరా నరసింహారెడ్డికి చెందిన జతకు ద్వితీయ బహుమతి, పొన్నూరు మండలం గోళ్లమూడిపాడుకు చెందిన ఉప్పలక్ష్మయ్య చౌదరి ఎడ్ల జతకు తృతీయ స్థానం లభించింది. హాజరైన 18ఎడ్ల జతల్లో పదింటికి అవి నిర్ణయించిన సమయంలో బండలాగిన దూరాన్ని బట్టి స్థానాలను నిర్ణయించి బహుమతులను అందజేశారు. పోటీలను తిలకించేందుకు చుట్టుప్రక్కల మండలాలు, గ్రామాల నుంచి వేలాదిగా రైతులు, ఔత్సాహికులు తరలి రావటంతో స్టేడియం సందడిగా మారింది, వారందరూ కేరింతలు కొడుతూ ఎడ్లను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో నరసరావుపేట, రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, పిల్లి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, ఇప్పల దానారెడ్డి హాజరుకాగా, నిర్వాహక కమిటీ సభ్యులు చల్లానారప రెడ్డి, పాలిమేర వెంకటరెడ్డి, మూరే రవీంద్ర, పానుగోటి వెంకటరావు, కనకా పుల్లారెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, వంపు గుడిజాన్, గాడిపర్తి సీతయ్య పోటీలను పర్యవేక్షించారు. శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి రెఫరీలుగాను, వ్యాఖ్యాతగా సూరపునేని రాధాకృష్ణ వ్యవహరించారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణకు కృషి

- రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్‌ఖాన్
- చిలకలూరిపేటలో మైనార్టీ కమిషన్‌తో ముఖాముఖి


మాట్లాడుతున్న ఇక్బాల్ అహమ్మద్‌ఖాన్, పక్కన పి.గౌతంరెడ్డి

చిలకలూరిపేట: మైనార్టీల హక్కులను పూర్తిస్థాయిలో పరిరక్షించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర మైనార్టీ కమిషన్‌కు పూర్తి స్వేచ్ఛ, అధికారాలను కట్టబెట్టారని ఏపీ రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్ ఖాన్ చెప్పారు. క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చిలకలూరిపేట నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో మంగళవారం ఏపీ రాష్ట్ర మైనార్టీస్ కమిషన్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహమ్మద్‌ఖాన్ మాట్లాడుతూ మైనార్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా కమిషన్ స్పందించి న్యాయం చేకూరుస్తుందని వెల్లడించారు. యూపీ, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో మైనార్టీ హక్కులు కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మైనార్టీలకు పూర్తి రక్షణ ఉందని వెల్లడించారు. ఇష్టమైన జీవనవిధానం అవలంబించేలా ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తోందన్నారు. మైనార్టీలు ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా తమకు న్యాయం జరగలేదని, వివక్షకు గురయ్యామని భావించిన పక్షంలో వెంటనే మైనార్టీ కమిషన్‌ను సంప్రదించాలని సూచించారు. కమిషన్ సంబంధిత అధికారులకు సమన్లు జారీచేసి వారికి న్యాయం చేకూరుస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు లభించకున్నా వెంటనే ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం మైనార్టీ కమిషన్‌కు పూర్తి స్వేచ్ఛ, అధికారాలను అప్పగించిందని వెల్లడించారు. సీఎం జగనన్న ఆశయాల మేరకు ప్రజల వద్దకే సమస్యల పరిష్కారానికి వచ్చినట్లు చెప్పారు.

మైనార్టీల ప్రభుత్వం ...

మరో అతిథి ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి.గౌతంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని చెప్పారు. ప్రతి ప్రభుత్వ పథకంలోనూ, పదవుల్లోనూ సంబంధిత వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందని వెల్లడించారు. శిథిలావస్థకు చేరిన ప్రాచీన చర్చీలకు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అలాగే క్రైస్తవ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో మైనార్టీ వర్గాలకు చెందిన వారి జీవన విధానం, కష్టాలను గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి మైనార్టీ కమిషన్‌ను బలోపేతం చేశారని వెల్లడించారు. కమిషన్ వైస్ చైర్మన్ అడిపి జాషువా డానియేల్, సభ్యులు సయ్యద్ హిదాయతుల్లా, జితేంద్రజిత్ సింగ్, షేక్ సైపుల్లా, క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు చేగూడి జాషువా డానియేల్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ

చీరాల: భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని డీటీవో ఎ.చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు మంగళవారం చీరాల మసీద్ సెంటర్‌లో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 216 జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వాటిని అరికట్టేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి హైవే పైకి వచ్చే వారు రహదారిపై ఇరువైపులా వాహనాలను గమనించాలన్నారు. పలు ప్రాంతాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. రహదారులపై ప్రమాద ఘటనలు జరిగినప్పుడు క్షతగాత్రులను కాపాడాలని, 108కు సమాచారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చీరాల ఎంవీఐ బి.రామకృష్ణారెడ్డి, బాపట్ల ఎంవీఐ ప్రసన్న కుమారి, ఏఎంవీఐ అంకమ్మరావు, చీరాల ఒన్ టౌన్ ఎస్సై అహ్మద్‌జానీ, రవాణాశాఖ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.